ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ 5 భూపాలపల్లి
ఆదివారం 23 జూన్ 2024

ములుగు ఎస్బీ ఇన్స్పెక్టర్ సస్పెన్షన్

ములుగు, జూన్ 22: ములుగు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న సి.హెచ్.శ్రీధర్ సస్పెండ్ అయ్యారు. ఈమేరకు మల్టీజోన్ ఐజీ ఏవీ.రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. 2022-23 మధ్యకాలంలో ఆయన ఖమ్మం టూటౌన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న క్రమంలో ఒకరిపై తప్పుడు కేసు నమోదు చేయడమే కాకుండా మరో కేసులో కోర్టును తప్పుదోవ పట్టించేలా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం సీపీ జరిపిన విచారణలో వాస్తవమని తేలింది. ఆ నివేదిక ఆధారంగా శ్రీధర్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. అయితే ఈ సస్పెన్షన్ ఉత్తర్వులకు సంబంధించిన సమాచారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి అర్ధరాత్రి వరకు కూడా అందలేదు.

మహదేవపూర్ సీఐ బదిలీ

సర్కిల్ పరిధిలో వరుస ఘటనల నేపథ్యంలో వేటు

కాళేశ్వరం పోలీస్‌స్టేషన్
మహిళా కానిస్టేబుల్‌పై ఎస్సై లైంగిక వేధింపులు

రెండు నెలల క్రితం మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో
కాంగ్రెస్ నేత డ్యాన్స్

వివరాలు 6వ పేజీలో...

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందని వైద్యం
- కనీస సౌకర్యాలు కరువు, డాక్టర్ల పోస్టులు ఖాళీ
- కానరాని ల్యాబ్‌టెక్నీషియన్లు, సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- దయనీయంగా ఆరోగ్య ఉపకేంద్రాలు
- ప్రహసంగా మారిన పల్లె దవాఖానాలు
- ఏజెన్సీ ప్రాంతాల్లో దైన్యం
- దూరంగా పీహెచ్‌సీలు
- కొత్త పీహెచ్‌సీల ప్రతిపాదనలు బుట్టదాఖలు
- అన్ని ఆస్పత్రుల్లో తీవ్రంగా మందుల కొరత
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ రోగులు



వైద్యం మిధ్య!



వరంగల్ మెడికల్, జూన్ 22: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) వైద్యం అందని ద్రాక్షలా మారింది. అనేక సమస్యలతో కూనారిల్లుతున్న ఈ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద రోగులకు సరైన వైద్యాన్ని అందించలేక పోతున్నాయి. చేసేది లేక చివరకు వారు ప్రైవేటు ఆస్పత్రులను సందర్శించక తప్పడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు పాలకులు పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్న వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పీహెచ్‌సీల్లో డాక్టర్లతో పాటు వివిధ విభాగాల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసే విషయంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది.

డాక్టర్ల కొరత

ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో పల్లె దవాఖానాలను నెలకొల్పినా పలుచోట్ల డాక్టర్లను నియమించలేదు. మహిళా, పురుష సమీకృత కార్య కర్తలు (ఎంపీహెచ్) పోస్టులు కూడా 40 శాతానికిపైగా ఖాళీగా ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దర ప్రధాన వైద్యులను నియమించాల్సి ఉండగా, కొన్ని కేంద్రాల్లో ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారు. దీంతో ఆర్‌బీఎస్‌కే నుంచి కొందరిని పల్లె దవాఖానాల్లో నియమించినా వారిని కూడా పీహెచ్‌సీలకు సర్దుబాటు చేస్తూ డిప్యూటేషన్‌పై పంపిస్తున్నారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొన్ని చోట్ల పూర్తిస్థాయి వైద్య సేవలు అందడం లేదు. పీహెచ్‌సీల్లో, పల్లె దవాఖానాల్లో, ఆరోగ్య ఉపకేంద్రాల్లో డాక్టర్ల లేకపోవడంతో రోగులు ఆ వైద్య కేంద్రాలకు వేళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. పీహెచ్‌సీల్లో ఒక్క డాక్టరే ఉండడంతో ఆయన సెలవు పెట్టినరోజు ఆ కేంద్రంలో రోగులకు వైద్య సేవలకే కూడా సెలవే. ఒక్కో పీహెచ్‌సీకి రోజుకు కనీసం 60 నుంచి 70 మంది రోజులు వస్తుంటారు. వారంతా పీహెచ్‌సీకి వచ్చి డాక్టర్ కోసం పడిగాపులు కాయడం, తీరా ఆ రోజు డాక్టర్ రావడం లేదని చెప్పడం నిరాశతో వెనుతిరిగి వెళ్లడం పరిపాటిగా మారింది.

ల్యాబ్ టెక్నీషియన్లు లేక..

ఉమ్మడి జిల్లాలో అనేక ల్యాబ్ టెక్నీషియన్ల (ఎల్‌టీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంలో కీలకమైన ల్యాబ్‌టెక్నీషియన్లు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో పేద రోగులు అక్కడ పెద్ద మొత్తంలో ఫీజులు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారు. పీహెచ్‌సీల్లో ఎల్‌టీలు లేకపోవడంతో రోగుల రక్త నమూనాలను అక్కడ ఉన్న ఇతర సిబ్బంది సేకరిస్తుండడం కనిపిస్తోంది.

అధ్వాన్నంగా ఉప కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలోని ఆరోగ్య ఉపకేంద్రాలు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లెదవాఖానాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావించినప్పటికీ అది పూర్తిస్థాయిలో ఆచరణలోకి రాలేదు. ఇంతకాలం ఎన్‌ఎన్‌ఎం, ఆశావర్కర్ల సేవలకు మాత్రమే పరిమితమైన ఈ కేంద్రాల్లో క్వాలిఫైడ్ డాక్టర్లను నియమించాలని నిర్ణయించినప్పటికీ ఇప్పటి వరకు ఆ దిశగా పెద్దగా అడుగులు పడలేదు. ఆరోగ్య ఉపకేంద్రాలకు రావడానికి క్వాలిఫైడ్ డాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆశించిన లక్ష్యం నెరవే రలేదు. ప్రతీ ఐదువేల జనాభాకు ఒకటి చొప్పున ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ఇద్దరు ఏఎన్‌ఎంలు, ప్రతీ వెయ్యి జనాభాకు ఒక ఆశావర్కర్ చొప్పున ఉండి ప్రభుత్వ వైద్యసేవలను, పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి. అయితే ఈ ఉప కేంద్రాల్లో డాక్టర్ల లేని కారణంగా అవి

మిగతా 8వ పేజీలో..



ఏజెన్సీలో అందని వైద్యం

గిరిజన ప్రాంతాల్లో కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు కలగా మారింది. ఏజెన్సీ పరిధిలోని మండలాలు విస్తీర్ణపరంగా పెద్దగా ఉంటాయి. రవాణ సౌకర్యాలు తక్కువగా ఉంటాయి. మారుమూల ప్రాంతాల్లో పరిస్థితులు మరింత దయనీయంగా ఉంటాయి. వ్యాధులు ఎక్కువగా ప్రబలేది ఇక్కడే. వాస్తవంగా ఇక్కడ ఒక్కో ఏజెన్సీ మండలంలో విస్తీర్ణాన్ని బట్టి రెండేసి పీహెచ్‌సీలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, కొన్నిచోట్ల ఒక్కటి కూడా సరిగా లేదు. దీంతో ములుగు జిల్లా పరిధిలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలు అందని దుస్థితి నెలకొని ఉన్నది. ఏజెన్సీల్లో కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుకు వైద్యాధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ ఇప్పటి వరకు ఆమోదానికి నోచుకోలేదు.

మృత్యుఘోష

ఏజెన్సీలో తరుచూ శిశువులు, గర్భిణులు, బాలింతలు మృతి చెందుతున్న సంఘటనలు తరుచూ చోటుచేసుకుంటుండడంతో మారుమూల కొత్త పీహెచ్‌సీల ఏర్పాటు చర్చనీయాంశంగా మారింది. ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్‌సీలు మండల కేంద్రాలకు 50 నుంచి 60 కి.మీ. దూరంలో గ్రామాలు ఉండడం, ఆయా గ్రామాలకు ఎటువంటి రోడ్డు సదుపాయం లేకపోవడంతో రోగులు చికిత్స కోసం ప్రయాస పడాల్సి వస్తోంది. ఆయా ప్రాంతాల్లోని గిరిజనులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా సకాలంలో వైద్య సేవలు అందని పరిస్థితి. దీంతో రోగులు, గర్భిణులను మంచాల్లో మోసుకొని రావల్సి వస్తున్నది. ఈ క్రమంలో తల్లీ లేదా బిడ్డ ప్రాణాలు పోతున్న ఉదంతాలు కూడా అడపాదడపా చోటు చేసుకుంటున్నాయి. విస్తీర్ణపరంగా అధికంగా ఉన్న గిరిజన ప్రాంతాల్లో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాత ఆరోగ్య ఉపకేంద్రాలను పునర్విభజన చేయాల్సిన అవసరం ఉందని డాక్టర్లు అభిప్రాపడుతున్నారు.

ప్రాజెక్టుల నుంచి వ్యర్థాల తొలగింపు

సమ్మక్క బ్యారేజీ నుంచి కాంక్రీట్ వేస్టేజ్.. దేవాదుల ప్రాజెక్టులో షిల్ట్



సమ్మక్క సాగర్ బ్యారేజీలో తొలగిస్తున్న కాంక్రీట్ వేస్టేజ్

కన్నాయిగూడెం, జూన్ 22: మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోని కాంక్రీటు వేస్టేజ్, గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని షిల్ట్‌ను తొలగిస్తున్నారు. బ్యారేజీలోని నీళ్లంటినీ దిగువకు వదిలి ఖాళీ చేసి కాంక్రీట్ వ్యర్థాల తొలగింపు పనులు చేపడుతున్నారు. బ్యారేజీ నిర్మాణ సమయంలో వాటర్ డైవర్షన్ కోసం కాఫర్ డ్యాం నిర్మాణానికి కాంక్రీట్‌తో కల్వర్టులను నిర్మించారు. ఆ పనులు పూర్తి కావడంతో కల్వర్టులను భారీ యంత్రాలతో కూల్చివేశారు. కాంక్రీటు శకలాలను టిప్పర్ల ద్వారా బయటకు తరలిస్తున్నారు. అలాగే దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద షిల్ట్ తొలగింపు పనులు సైతం ముమ్మరంగా సాగుతున్నాయి. యాసంగి ముగిసి వానాకాలం ప్రారంభం కావడంతో ప్రాజెక్టులో పంపింగ్‌ను నిలిపి వేశారు. ఖరీఫ్ పంటలకు నీటిని పంపింగ్ చేసేందుకు వీలుగా ఇన్‌టేక్‌వెల్‌లో పేరుకుపోయిన షిల్ట్‌ను తొలగిస్తున్నారు. ఈ పనులు 15-20 రోజులపాటు కొనసాగే అవకాశం ఉందని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

రామప్ప దేవాలయాన్ని అభివృద్ధి చేయాలి

ములుగు కలెక్టర్ దివాకర



సమావేశంలో పురావస్తుశాఖ అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూన్ 22: వెంకటాపూర్(రామప్ప) మండలంలోని ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప దేవాలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. తన చాంబర్‌లో ఆయన పురావస్తుశాఖ అధికారులతో శనివారం సమావేశమయ్యారు. ప్రసాద్‌స్కీంలో భాగంగా జరుగుతున్న రామప్ప దేవాలయ అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రసాద్ స్కీంలో భాగంగా పదెకరాల విస్తీర్ణంలో రూ.61.99 కోట్ల నిధులతో నిర్మాణం జరుగుతున్న ఇంటర్ప్రిటేషన్ సెంటర్ పనులను వేగవంతం చేయాలని అన్నారు. రామప్పకు వచ్చే పర్యాటకులు స్టాల్స్ ఫుడ్‌కోర్ట్, పార్క్, ఆడిటోరియం, మరుగుదొడ్లు, బ్యాటరీ వెహికిల్స్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన అనంతరం యునెస్కో నియమ నిబంధనల ప్రకారం రామప్ప దేవాలయం పరిసరాల్లో ఉన్న శివాలయం, గొల్లాలగుడి దేవాలయాలు, రామప్ప దేవాలయం ఒకే ప్రాంగణంలో ఉండాలని, వాటికి సంబంధించిన స్థల సర్వేలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. శివాలయం, గొల్లాలగుడి పరిసర ప్రాంతాలను త్వరలో పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర పురావస్తుశాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రోహిణిపాండే అంబేద్కర్, జిల్లా పురావస్తుశాఖ అధికారి ఎం.మల్లేష్, పురావస్తుశాఖ సర్వేయర్ ప్రశాంత్, ఏఈ విజయ్, క్షేత్ర ఫౌండేషన్ సభ్యుడు సూర్యనారాయణమూర్తి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీ స్థలం చుట్టూ స్తంభాలు ఏర్పాటు చేయాలి..

ములుగు శివారులోని గిరిజన విశ్వవిద్యాలయం స్థలం చుట్టూ సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని గట్టమ్మదేవాలయం ఎదురుగా ఉన్న గిరిజన విశ్వవిద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం 337 ఎకరాల స్థలాన్ని సేకరించినట్లు తెలిపారు. సంబంధిత స్థలాన్ని రెవెన్యూ అధికారులు ట్రైబల్ వెల్ఫేర్‌శాఖకు బదలాయించారన్నారు. ఈసంవత్సరం యూనివర్సిటీ ఏర్పాటులో భాగంగా తాత్కాలిక తరగతుల నిర్వహణ ములుగు మండలంలోని జాకారంలోని ట్రైబల్ యూత్ ట్రెయినింగ్ సెంటర్‌లో ప్రారంభమవుతుందని అన్నారు. 337ఎకరాల స్థలాన్ని ఎవరూ ఆక్రమించకుండా చుట్టూ సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. స్థలాన్ని ఎవరైనా ఆక్రమించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్, ఆర్‌ఐ విజేందర్, సర్వేయర్ తదితరులు ఉన్నారు.

రెండు లారీల ఢీ

చెలరేగిన మంటలు



నారాయణపురం శివారులో ఢీకొన్న లారీలు

రేగొండ, జూన్ 22: రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగిన సంఘటన మండలంలోని నారాయణపురం శివారులో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి పరకాల వైపు వెళ్తున్న బూడిద లారీని ఇసుక లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో మంటలు చెలరేగి ఇసుక లారీ ముందు భాగం కాలిపోయింది. రెండు లారీల డ్రైవర్లు సురక్షితంగా బయటపడ్డారు.

వానలు కురవాలని 'వరదపాశం'

బండరాయిపై పాశంపోసి నాకిన గ్రామస్థులు


కొత్తూరువాసుల సనాతన ఆచారం



పాశం బువ్వను కాలుకతో నాకుతున్న కొత్తూరు గ్రామస్తులు

ములుగు, జూన్ 22: వర్షాలు కురవడం ఆలస్యమైతే వరుణ దేవుడి కటాక్షం కోసం యజ్ఞయాగాదులు జరిపించడం, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయడం, కప్పతల్లి ఆటలు ఆడటం చూస్తూనే ఉంటాం. కానీ, ములుగు జిల్లాలోని ములుగు మండలం కొత్తూరువాసులు అనాదిగా వింత ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. తమ ఇలవేల్పు లక్ష్మీనర్సింహస్వామికి వరదపాశం పేరిట వేడుకను జరిపిస్తున్నారు. బియ్యం, బెల్లం, పాలు, కొబ్బరితో వండిన పాశం బువ్వను దేవునికి నైవేద్యంగా సమర్పించి ఆతర్వాత పేద్ద బండరాయిపై పాశంబువ్వను పోసి నాలుకతో నాకుతారు. ఇలా చేస్తే వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపిస్తాడని విశ్వసిస్తారు. ఇదే రీతిన శనివారం గ్రామ సమీపంలోని దేవునిగుట్టపై వరదపాశం కార్యక్రమాన్ని జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరమనేని కిషన్‌రావు ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అడవి మార్గాన గుట్టపై ఉన్న పురాతన లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడే దేవునికి నైవేద్యం వండి సమర్పించారు. అనంతరం సామూహికంగా పాశం బువ్వను బండపై పోసి నాకారు. తమ పూర్వీకుల నుంచి ఈ ఆచారం కొనసాగుతోందని ఆలయ కమిటీ అధ్యక్షుడు కిషన్‌రావు తెలిపారు. విస్తారంగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా కలగాలని, అంటువ్యాధులను నిలువరించాలని దైవాన్ని వేడుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు అక్కల సంపత్, కార్యదర్శి కంచె చంద్రమోహన్, కోశాధికారి గట్టి సుదర్శన్ పాల్గొన్నారు.

బోగీలేనా..?



ఇవేమిటి.. గూడ్స్ రైలు బండి వ్యాగన్లా..? చూడ్డానికి అలాగే ఉన్నాయి కదూ! కాస్త పరీక్షగా చూస్తే గానీ కాదనిపిస్తుంది. ఇవి మరేమిటో కాదు.. ఇసుక టిప్పర్లు. క్వారీ వద్దకు వెళ్లే క్రమంలో పచ్చని చెట్ల మధ్య కెనాల్ పక్కన ఇలా బారులు తీరాయి. అచ్చం పట్టాలపై ఉన్న రైలు బండి బోగీల్లా ఒకదాని వెనుక ఒకటి క్యూ కట్టాయి. ఈ దృశ్యం కాటారం మండలం గుండ్రాత్‌పల్లి, మహదేవపూర్ మండం అన్నారం మధ్య ఉన్న గ్రావిటీ కెనాల్ ఒడ్డున శనివారం దర్శనమిచ్చింది.

- కాటారం

బొగ్గు బ్లాకుల వేలం నిలిపివేయాలి



భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

కాకతీయఖని, జూన్ 22: సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే నిలిపివేసి, ఆ సంస్థకే అప్పగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సాయిలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొగ్గు బావుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు బావులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రధాని నరేంద్రమోదీ పూనుకున్నారని విమర్శించారు. సింగరేణి కార్మికులను దృష్టిలో ఉంచుకుని మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించే విధంగా పీఎం మోదీతో గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడాలని కోరారు. సింగ రేణిపై అనేక మంది ఆధారపడి జీవిస్తున్నారని, అలాంటి సంస్థను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రాజయ్య, రమేష్, రవికుమార్, బాబు, సాంబయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్



హనుమకొండలోని విద్యుత్ భవన్‌లో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

హనుమకొండ టౌన్, జూన్ 22: గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ సూచించారు. శనివారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో గిరిజన విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డితో హుస్సేన్‌నాయక్ ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా లైజనింగ్ ఆఫీసర్‌ను నియమించి, ఎస్టీ సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన ఉద్యోగులపై ఉన్న 20 డీసీ కేసులపై సమీక్ష జరిపి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్స్ మోహన్‌రావు, అశోక్, సదర్‌లాల్, గిరిజన విద్యుత్ ఉద్యోగుల అసోసియేషన్ కంపెనీ అధ్యక్షుడు భూక్య వాలునాయక్, అజ్మీర శ్రీరామ్‌నాయక్, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు బి.రాజశేఖర్, కేబీ రాజేందర్, స్వామినాయక్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనరేట్‌లో ఎస్టీ కేసులపై సమీక్ష

వరంగల్ క్రైం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ శనివారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయానికి వచ్చారు. అదనపు డీసీపీ రవి కమిషన్ సభ్యుడికి స్వాగతం పలికారు. అనంతరం కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎస్టీ పెండింగ్ కేసుల వివరాలు, బాధితులకు అందించాల్సిన నష్టపరిహారానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని హుస్సేన్ నాయక్ సూచించారు.

మహదేవపూర్ సీఐపై బదిలీ వేటు

మహదేవపూర్ రూరల్, జూన్ 22: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ సీఐ రాజేశ్వరరావుపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు మల్టీ జోన్-1 ఐజీ రంగనాథ్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రతిని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. రెండు నెలల కిందట మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో ఓ ప్రజాప్రతినిధి డ్యాన్స్ చేసిన సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. సందర్భంలో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ సస్పెండ్ చేయడంతో పాటు ఎస్సై ప్రసాద్‌ను వీఆర్‌కు బదిలీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. మహిళా కానిస్టేబుల్‌పై లైంగిక దాడి కేసులో రెండు రోజుల కిందట కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ అరెస్టు డిస్మిస్ అయ్యాడు. ఈరెండు ఘటనలు రెండునెలల వ్యవధిలో ఒకే సర్కిల్ పరిధిలో చోటు చేసుకోవడంతో పర్యవేక్షణ అధికారిగా ఉన్న మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావుపై బదిలీ వేటు పడినట్లు తెలుస్తోంది. వరుసగా సంఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సమర్థంగా విధులు నిర్వర్తించే అధికారికి బాధ్యతలు అప్పగించాలని ఉద్దేశంతో సీఐ రాజేశ్వరరారవును బదిలీ చేసినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఆయన స్థానంలో కొత్తవారికి బాధ్యతలు అప్పగించకపోవడంతో పోస్టింగ్ కోసం పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గతంలో కాళేశ్వరం, మహదేవపూర్ పీఎస్‌లలో ఎస్సైలుగా పనిచేసి సీఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన అధికారులు.. మళ్లీ మహదేవపూర్ సర్కిల్‌లోనే పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. వీరితో మరో ఇద్దరు ఇదే సర్కిల్‌లో పోస్టింగ్ కోసం స్థానిక రాజకీయ నాయకుల సహకారంతో ఉప ముఖ్యమంత్రి వద్ద పైరవీ చేస్తున్నట్లు సమాచారం.


విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న పాలిసెట్ జిల్లా కన్వీనర్ డాక్టర్ బైరి ప్రభాకర్

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం


వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 22: పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్‌లో పాలిసెట్ వరంగల్ జిల్లా కన్వీనర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ శనివారం ప్రారంభించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మొదటి రోజు మొత్తం 480 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్లు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. కాగా, వెయ్యిలోపు ర్యాంకులు సాధించిన 15 మంది విద్యార్థుల తల్లిదండ్రులను కౌన్సెలింగ్ సెంటర్‌లో కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్ శాలువాతో సత్కరించారు. విద్యార్థుల లక్ష్యసాధనకు అన్ని విధాలా సహకారాలు అందిస్తున్న తల్లిదండ్రులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు చూపిస్తున్న శ్రద్ధకు గౌరవంగా తాము ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

డొల్ల కంపెనీల పేరిట మోసం

● జాబ్ గ్యారంటీ పేరిట వసూళ్లు ● డైరెక్టర్లుగా అవకాశం ఇస్తానని దగా ● దిక్కుతోచని స్థితిలో బాధితులు

వరంగల్ క్రైం, జూన్ 22: డొల్ల కంపెనీలు పెట్టి నిరుద్యోగులను మోసం చేసిన ఘటన హనుమకొండలో చోటు చేసుకుంది. లేని కంపెనీలు ఉన్నట్లు పేపర్ల మీద సృష్టించి లక్షలు దండుకుని తప్పించుకుని తిరుగుతున్నాడు ఓ ప్రబుద్ధుడు. సదరు మాయలోడు చేసిన మోసంతో పలువురు నిరుద్యోగులు రోడ్డున పడ్డారు. అతడు చెప్పిన మాయమాటలు నమ్మిన బాధితులు లక్షలు పోగొట్టుకుని ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

హనుమకొండలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఒక వ్యక్తి.. 2017లో హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రారంభించాడు. ఈ క్రమంలో 2020లో ఎథిరాం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని ప్రారంభించి వరంగల్ నగరంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రెయినింగ్ సెంటర్ ప్రారంభించాడు. స్థానికుల సహకారంతో మడికొండ ఐటీ సెక్టార్‌లో కొంత ప్రభుత్వ స్థలం తీసుకున్నాడు. జాబ్ గ్యారంటీ పేరిట ట్రెయినింగ్ ప్రారంభించి ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షలకు పైగా వసూలు చేశాడు. ఇలా.. దాదాపు 100 మంది వద్ద డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. ట్రెయినింగ్ పూర్తి అయిన తర్వాత నిరుద్యోగులు ఉద్యోగాలపై నిలదీస్తే తప్పించుకుతిరిగాడు. దీంతో కంపెనీ నిర్వాహకుడిని విద్యార్థులు నిలదీశారు. ఈ విషయమై ఇంజనీరింగ్ కళాశాల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో నిర్వాహకుడిని ప్రశ్నించారు. కేసు పెడుతామని హెచ్చరించడంతో చెప్పా పెట్టకుండా రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కంపెనీలన్నీ పేపర్లమీదనే ఉన్నట్లు గ్రహించిన బాధితులు.. మోసపోయినట్లు గ్రహించి నిర్వాహకుడి కోసం వెతికినా ఫలితం లేకుండాపోయిందని వాపోతున్నారు. అయితే హైదరాబాద్‌లో వెతికిపట్టుకున్న కొందరు విద్యార్థులను బెదిరించినట్లు సమాచారం. డబ్బులు పోగొట్టుకున్న బాధితులు వారి పేరు చెప్పేందుకు సైతం జంకుతున్నారంటే నిర్వాహకుడు ఏ స్థాయిలో బెదిరింపులకు గురిచేస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు.



భాగస్వామ్యం ఇస్తానని మోసం

ఎథిరాం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ నిర్వాహకుడు ట్రెయినింగ్‌ల పేరిట నిరుద్యోగులను మోసం చేయడంతోపాటు డైరెక్టర్లుగా అవకాశం ఇస్తానని పలువురిని మోసం చేసినట్లు తెలిసింది. పొరుగు దేశంలో ఉన్న స్నేహితుడి వద్ద రూ.25లక్షలు తీసుకున్న సదరు కంపెనీ నిర్వాహకుడు.. మరొకరిని ఇండియాకు పిలిపించి మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇండియాకు వచ్చిన మరో బాధితుడి నుంచి రూ.15లక్షలు తీసుకుని డైరెక్టర్ చేస్తానని మోసం చేయడంతో పాటు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వలేదని బాధితుడు తెలిపాడు. బాధితుడు ప్రస్తుతం హైదరాబాద్‌లో ఒక షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. పొరుగు దేశంలో ఉన్న బాధితుడు హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు తెలిపారు. హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి ఒకరు తన కుమారుడికి ఎథిరాం కంపెనీలో డైరెక్టర్ అవకాశం ఇస్తానంటే రూ.1కోటి వరకు నిర్వాహకుడికి ఇచ్చాడు. ఈ విషయాన్ని స్వయంగా ప్రభుత్వ ఉద్యోగి తెలిపాడు. ఇలాగే మరో ముగ్గురి వద్ద రూ.15లక్షల చొప్పున తీసుకుని సంవత్సరంలో కోటి ఇస్తానని, నెలనెల రూ.1లక్ష వేతనం ఇస్తానని మోసం చేసినట్లు బాధితులు తెలిపారు. తన వద్ద పనిచేసే ఉద్యోగులకు సైతం వేతనాలు ఇచ్చేవాడు కాదనే విమర్శలున్నాయి. సదరు నిర్వాహకుడిపై బాధితులు ఇండస్ట్రీస్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి, జిల్లా జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు.

జాబ్ గ్యారంటీ అని మోసం చేశాడు..

ఎన్.రాహుల్, బాధితుడు



జాబ్ గ్యారంటీ అంటే శిక్షణ కోసం రూ.1లక్ష 50వేల చెల్లించాను. శిక్షణ కూడా ఏమి ఇవ్వలేదు. శిక్షణ కోసం లెక్చరర్స్ కూడా లేరు. మమ్మల్ని యూట్యూబ్‌లో చూసుకుని నేర్చుకోండి అనేవాడు. తొమ్మిది మాసాలు జాబ్ వస్తుందనే ఆశతో టీచింగ్ లేని శిక్షణలో పాల్గొన్నాం. తీరా జాబ్ గురించి ప్రశ్నించే సమయంలో బోర్డు తిప్పేసి వెళ్లాడు. డబ్బులు వసూలు చేసుకునేందుకు ప్రయత్నించాం. ఫలితం లేకుండా పోయింది. జాబ్ కోసం వచ్చి డబ్బులు పోగొట్టుకున్నాం. అతడి జాడ కోసం వెతుకుతున్నాను.

కంటెంట్ తీసుకుని మోసం చేశాడు..

కె.సంతోష్, బాధితుడు



మోసపూరిత మాటలు చెప్పి నేను తయారు చేసిన ఒక సంస్థకు సంబంధించిన కంటెంట్ తీసుకున్నాడు. ఒక సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ తీసుకున్నాడు. నా సర్వీసు తీసుకుని మోసం చేశాడు. అతడి వల్ల రూ.15లక్షలకు పైగా నష్టపోయా. డబ్బులు అడిగితే అనుచరుడితో బెదిరింపులకు పాల్పడుతున్నాడు. లీగల్ నోటీసు ఇచ్చినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. అతడిపై పోలీసులు చర్యలు తీసుకోవాలి.

ప్రైవేటు ఫిర్యాదులు వచ్చాయి..

ఆర్.సంతోష్‌కుమార్, టీఎస్ఐఐసీ, జోనల్ మేనేజర్

ఎథిరాం ప్రైవేటు లిమిలెడ్ కంపెనీకి స్థలం కేటాయించాం. కిందటేడు భవనం పూర్తి చేయాల్సి ఉండగా, గడువు కోరితే మరో సంవత్సరం ఇచ్చాం. ఈ యేడు నెలాఖరులోగా పూర్తి చేయకుంటే నోటీసు ఇచ్చి కేటాయించిన స్థలం రద్దు చేస్తాం. సంస్థ నిర్వాహకుడిపై ప్రైవేటు ఫిర్యాదులు వచ్చాయి. నిర్వాహకుడుకి డబ్బులు ఇచ్చామని, భాగస్వామ్యం ఇస్తానని ఇవ్వలేదని, జాబ్ ఇస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశాడని ఫిర్యాదు వచ్చాయి. అవి ప్రైవేటు ఫిర్యాదులు.. మా పరిధిలోవి కావు. కొంతమంది కంపెనీ వివరాలు ఆర్టీఏ కింద కోరితే అందించాం. నిబంధనలు విస్మరిస్తే సదరు నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటాం.

విద్యుత్ పోల్ ఎక్కే పరీక్షకు 12 మంది హాజరు

హనుమకొండ టౌన్, జూన్22: జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) నియామకాల్లో భాగంగా శనివారం హనుమకొండ ములుగురోడ్డులోని నార్తర్న్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌పీటీఐ)లో 7వ సారి నిర్వహించిన విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 16 మందికిగానూ 12 మంది హాజరైనట్లు హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. డైరెక్టర్ మోహన్‌రావు, వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, టెక్నికల్ డీఈ ఆనందం, ఎన్‌పీటీఐ డీఈ రాజేందర్ పర్యవేక్షణలో వీడియోగ్రఫీ మధ్య పరీక్ష ముగిసింది. కాగా, కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లను హనుమకొండ ఎస్ఈ కార్యాలయంలో ప్రదర్శించనున్నట్లు ఎస్ఈ తెలిపారు.

మానుకోటలో యువకుడి అదృశ్యం


పొడకంటి రంజిత్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జూన్ 22 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం భవానినగర్‌లో ఈ నెల 10వ తేదీన పొడకంటి రంజిత్ అనే యువకుడు అదృశ్యమయ్యాడని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. హనుమకొండ 57వ డివిజన్ సమ్మయ్యనగర్‌కు చెందిన పొడకంటి వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెను మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం జరిపించగా ఈ నెల 10న ఆమె గుండెజబ్బుతో మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు చిన్న కొడుకు పొడకంటి రంజిత్‌ను తీసుకుని కుటుంబసభ్యులు మహబూబాబాద్‌కు చేరుకున్నారు. అంత్యక్రియల అనంతరం సాయంత్రం కిరాణషాపుకు వెళ్లి వస్తానని చెప్పిన రంజిత్ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో వారు బంధువుల ఇండ్లలో వాకబు చేశారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఈ నెల 11న తండ్రి వెంకటేశ్వర్లు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ దేవేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్సిటీ నిబంధనలు పాటించిన కళాశాలలకే గుర్తింపు

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి

వర్సిటీ అనుబంధ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం




సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూన్ 22: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో యూజీసీ నిబంధనల మేరకు నడుచుకునే కళాశాలలకే వర్సిటీ అనుబంధ గుర్తింపును కొనసాగిస్తామని, నిబంధనలు పాటించని కళాశాలల గుర్తింపు రద్దు చేస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి స్పష్టంచేశారు. వర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్ల సమావేశం శనివారం కేయూ సెనెట్ హాల్‌లో జరిగింది. కేయూ అకడమిక్ ఆడిట్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. వర్సిటీ అనుబంధ కళాశాలలన్నీ బలోపేతం అయినప్పుడే వర్సిటీకి పేరు ప్రఖ్యాతులు వస్తాయని అన్నారు. వర్సిటీ పరిధిలోని కళాశాలలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని చెప్పారు. కొత్త కోర్సులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను, సేవలను అందించాలని సూచించారు. బోధన, శిక్షణ, పరిశోధనపై దృష్టి సారించాలని కోరారు. వర్సిటీ ఎంపిక చేసిన ప్రభుత్వ కళాశాలలను పరిశోధన కేంద్రాలుగా అనుమతులు ఇచ్చామన్నారు. ఆటానమస్ పొందిన కళాశాలల పరీక్షల ఫలితాలను ఆడిట్ చేస్తామని వెల్లడించారు. అనేక సమస్యలున్నప్పటికీ పరీక్షల నిర్వహణ పక్బందీగా నిర్వహించి ఫలితాలను సరైన సమయంలో విడుదల చేస్తున్నామని, పేర్కొన్నారు. ప్రభుత్వ అధ్యాపకులు పేపర్ వాల్యూవేషన్‌కు రావాలని కోరారు. వర్సిటీ కింద 297 కళాశాలుండగా, 197 కళాశాల బోధన సిబ్బందిని వర్సిటీ పోర్టల్‌లో నమోదు చేశారని వివరించారు.

డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు మాట్లాడుతూ.. జూన్ 10 నుంచి డిగ్రీ 3, 5వ సెమిస్టర్ క్లాస్‌లు ప్రారంభించినట్లు తెలిపారు. జూలై 1 నుంచి దోస్త్ మేరకు 1వ సెమిస్టర్ క్లాస్‌లు ప్రారంభమవుతాయని వెల్లడించారు. కళాశాలలు వర్సిటీ ఫీజులు చెల్లించాలని, అధ్యాపకుల రాటిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. వర్సిటీ ఆదేశాల మేరకు రికార్డులన్నీ పకడ్బందీగా నిర్వహించాలని, ల్యాబ్ చేయించాలని చెప్పారు. పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి మాట్లాడుతూ.. పరీక్షల నిబంధనలు పాటించాలని, అంతర్గత పరీక్షల, ప్రయోగ పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మాల్‌ప్రాక్టీస్ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రిన్సిపాళ్లు పరీక్షల విభాగానికి తెలియజేయాలని చెప్పారు. ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు పరీక్షల ప్రమోషన్, మాల్‌ప్రాక్టీస్, చాలెంజ్ వాల్యూవేషన్, వాల్యూవేషన్‌తో పాటు బకెట్ సిస్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే పరీక్షల విభాగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడూ విద్యార్థులకు తెలియజేయాలని చెప్పారు. కేయూ ఎన్ఎస్ఎస్ సమన్వయ అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ యూనిట్లను మైభారత్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. వర్సిటీ పరిధిలో 356 యూనిట్లు సక్రమంగా బ్యాంకు అకౌంట్లను నిర్వహిస్తున్నాయని, మిగతా 77 సక్రమంగా పనిచేయాలని చెప్పారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు స్పోర్ట్స్ ఫీజులు చెల్లిస్తున్నప్పటికీ క్రీడల్లో పాల్గొనడం లేదని అన్నారు. 297 కళాశాలల్లో కేవలం 10/15 కళాశాల విద్యార్థులే స్పోర్ట్స్‌లో పాల్గొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్మానాక్ మేరకు కళాశాలలు క్రీడలు నిర్వహించాలని, క్రీడా అధ్యాపకులను నియమించాలని అన్నారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ పలు సందేహాలను వర్సిటీ అధికారులకు విన్నవించారు. ప్రధానంగా 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహించాలని, అతిథి అధ్యాపకుల ఉత్తర్వులు సక్రమంగా ఇవ్వాలని, అల్మానాక్‌లో గ్యాప్ లేకుండా చూడాలని కోరారు. పరీక్షల విభాగం సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాలని కోరారు. పరీక్షల విభాగంలో హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వర్సిటీకి, కాలేజీయేట్ కమిషనరేట్ ఉన్నతాధికారులు సమన్వయం చేసుకోవాలని కోరారు. కేయూ అకడమిక్ విభాగం ఏఆర్ డాక్టర్ కోలా శంకర్ మాట్లాడుతూ.. కళాశాల ప్రారంభమైన 15 రోజుల్లో రీఅడ్మిషన్ పొందాలని చెప్పారు. ఈ సమావేశంలో పీఆర్‌వో డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ వందన సమర్పణ చేయగా, ఏఆర్‌లు హబీబుద్దీన్, ఆర్‌వీ, తొర్రూరు, పరకాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ బొలగాని రాములు, డాక్టర్ కొప్పుల మల్లేశం, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య


కృష్ణమాచారి (ఫైల్)

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 22: ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లోంచి దుర్వాస రావడంతో ఆలస్యంగా ఈ సంఘటన ఆలస్యంగా శనివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని సుభాష్‌కాలనీకి చెందిన కండపర్తి కృష్ణమాచారి (29) ఒంటరిగా ఉంటూ పౌరహిత్యం చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి కాలనీలో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఇంట్లోకి వెళ్లి చూడగా కృష్ణమాచారి ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. మృతదేహం కుళ్లిపోయి ఉంది. నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని పోలీసులు భావించారు. మృతుడు అవివాహితుడు కాగా మృతికి గల కారణాలు తెలియరాలేదు. తనకు పౌరహిత్యం చేయడం ఇష్టం లేక కొద్ది రోజులుగా మనస్తాపంతో ఉంటున్నట్లు తెలిసింది. భూపాలపల్లి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విచారణ అనంతరం మృతికి గల కారణాలు వెల్లడిస్తామని ఎస్సై సుధాకర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

టేకుమట్ల, జూన్ 22: విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని రామక్రిష్టాపూర్(టి) గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాద్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన వెంకటలక్ష్మి (48) తన కూతరు అయిన బూర భవాని ఇంటికి రామక్రిష్టాపూర్ (టి)కు ఇటీవల వచ్చింది. శుక్రవారం రాత్రి కురుసిన వర్షం కారణంగా డోర్ మ్యాట్ తడిసిపోయింది. దీంతో శనివారం ఉదయం వెంకటలక్ష్మి డోర్‌మ్యాట్‌ను ఆరేసేందుకు ఇంటి ముందు ఉన్న ఇనుప దండంపై వేసే క్రమంలో ఇంట్లో సరఫరా అయ్యే విద్యుత్ వైరు డ్యామేజీ అయి ఉండి తగిలి షాక్‌కు గురైంది. ఆమె కేకలు పెట్టడంతో వియ్యంపురాలు నిర్మల కాపాడే ప్రయత్నం చేసింది. ఆమె కూడా కరెంట్ షాక్‌కు గురిరైంది. గమనించిన కుటుంబ సభ్యులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వెంకటలక్ష్మి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. నిర్మలకు చికిత్స అందించారు.

కాళేశ్వరాలయాన్ని పరిశీలించిన స్థపతి

మహదేవపూర్, జూన్ 22: మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయ స్థపతి వల్లినాయగం శనివారం పరిశీలించారు. ప్రసాదశాల నుంచి సరస్వతీ మాత ఆలయానికి మార్గాన్ని ఏర్పాటు చేయడానికి పరిశీలించారు. ప్రహరీ వద్దగల పురాతన విగ్రహాలను పరిశీలించారు. ఆ విగ్రహాలను ఏం చేయాలన్నదానిపై సమగ్ర నివేదిక తయారు చేసి ఇస్తామని తెలిపారు. ఆయన వెంట ఎస్ఈ మల్లికార్జున్, డీఈ దుర్గాప్రసాద్, ఆలయ ఈవో మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆర్ఎం

కాకతీయఖని, జూన్ 22: భూపాలపల్లి ఆర్టీసీ డిపోను రీజనల్ మేనేజర్ విజయ్‌భాను శనివారం సందర్శించారు. ఉద్యోగులతో కాసేపు మాట్లాడి డిపో పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా డిపోకు ఆర్ఎం రావడంతో డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ భానుకిరణ్, డిపో సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

ఒకరికి తీవ్ర గాయాలు

తాడ్వాయి, జూన్ 22: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన సంఘటన మండలంలోని లవ్వా ల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగింది. ఏటూరునాగారం వైపు వెళ్తున్న భరత్ ఈసంఘటనలో భరత్‌కుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈవిషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సంఘ టనాస్థలికి చేరుకుని గాయపడిన భరత్ కుమా ర్‌ను 108 వాహనం ద్వారా ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆయనవెంట ఏఎస్సై నారాయణ, సిబ్బంది సాంబయ్య, రవీందర్‌లు ఉన్నారు.

సీపీఆర్ చేసిన వైద్యాధికారులు

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి అస్వస్థతో ఉండగా వైద్యాధికారుల బృందం సీపీఆర్ చేసింది. అనంతరం 108వాహనంలో ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈబృందంలో ఎదిర, రొయ్యూరు, చుంచుపల్లి వైద్యాధికారులు భవ్యశ్రీ, సుమలత, యమున తదితరులు ఉన్నారు.

రుణమాఫీతో 78,432 రైతులకు లబ్ధి

టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 22: రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం ద్వారా వరంగల్ ఉమ్మడి జిల్లాలో డీసీసీ బ్యాంకు పరిధిలో 78,432 రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో రుణమాఫీ, లబ్ధిపొందే రైతుల వివరాలను తెలియచేశారు. డీసీసీ పరిధిలోని బ్రాంచిలు, సహకార సంఘాల నుంచి రుణాలు తీసుకున్న రైతులకు ప్రభుత్వ నిర్ణయం ద్వారా గొప్ప ఆర్థిక ప్రయోజనం చేకూరనుందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీసీసీ బ్యాంకు ద్వారా రుణమాఫీ కలిగే రైతుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందచేసినట్లు చెప్పారు. ఈ విషయంలో పూర్తి పారదర్శకతతో వ్యవహరించినట్లు చెప్పారు. రుణమాఫీ, రైతుల వివరాల గురించి సందేహాలు ఉన్నట్లైతే రైతు, సహకార సంఘాలు తమ ద్వారా నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

డీసీసీ బ్యాంకు, సహకార సంఘాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రుణాలు తీసుకున్న రైతుల్లో 7లక్షల75వేల మంది రైతులకు ఆర్థిక ప్రయోజనం కలగనుందని చెప్పారు. రూ.5048.01 కోట్ల రుణమాఫీ జరుగనుందని వివరించారు. కేవలం డీసీసీ బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రుణాల పొందిన రైతుల రుణాల మాఫీయే ఇంత పెద్ద మొత్తంలో ఉంటే.. ఇక వాణిజ్య ఇతర బ్యాంకుల నుంచి తీసుకున్న రైతులు భారీ మొత్తంలో ఉంటుందన్నారు. ఇంతటి వ్యయభారాన్ని సైతం లెక్క చేయకుండా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండడం అభినందనీయమన్నారు. దేశ చరిత్రలోనే రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి ముఖ్యమంత్రిగా చిరస్థాయిలో నిలిచిపోతారని కొనియాడారు. గత ప్రభుత్వం దశల వారిగా రుణమాఫీ నిర్ణయాలు ప్రకటిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం సాహసోపేతమైనదిగా అభివర్ణించారు. రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నోరు పారేసుకున్నాయని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతులే వారికి గుణపాఠం చెప్పనున్నారని రవీందర్‌రావు పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ హరిప్రసాద్, డైరెక్టర్లు నర్సింగారావు, నరేందర్, మురళీధర్, రవితేజ, జగన్‌మోహన్, యాదగిరిరెడ్డి, డీసీసీ బ్యాంక్ సీఈవో మహ్మద్ వాజిర్ సుల్తాన్, సీపీవోలు రోహిణి, దమయంతి, కురువనాయక్, రాజశేఖర్, నవీన్, కల్యాణి, రాధిక, అశోక్, మధుసుదన్, స్రవంతి, కృష్ణమోహన్, రాజు, బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మహబూబాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు చేపట్టి లక్ష్యాలను నిర్దేశించుకుని పని చేయాలని సూచించారు. అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేదలకు నాణ్యమైన విద్య అందేలా కాంగ్రెస్ సర్కార్ చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలలో మత్తుపదార్థాల ద్వారా జరిగే నష్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గురుకులాలు, ఏకలవ్య, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు. నకిలీ విత్తనాలపై దృష్టి సారించి జిల్లాలోని టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలుచేపట్టి ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అధికారులు వేలాడే కరెంట్ తీగలను సరిచేసి మరణాలను నివారించాలని, నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు : ఎంపీ బలరాంనాయక్

గ్రామాల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా, వైద్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులకు ఏ పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో వ్యవసాయాధికారులు వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా చూడాలనిమంత్రిని కోరారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ గ్రామాల్లోని నర్సరీల్లో ఉన్న పండ్ల మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసే పనులు గ్రామ అవసరాలకు అనుగుణంగా ఉండేలా చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ అధికారులు సామాజిక బాధ్యతతో పనిచేయాలన్నారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అధికారులు పరిశుభ్రతపై దృష్టిసారించాలన్నారు.

డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా రమేష్

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూన్ 22 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖలోని డీసీఆర్‌బీ విభాగం ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.రమేష్ నియమితులయ్యారు. ఈమేరకు మల్టీ జోన్ ఐజీ రంగనాథ్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా హైదరాబాద్ సీఐడీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై జిల్లాకు నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రామకృష్ణ వరంగల్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా నియామకమైన రమేష్ సోమవారం విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

గోదావరికి హారతి


గోదావరికి హారతినిస్తున్న అర్చకులు

మహదేవపూర్, జూన్ 22: మండలంలోని కాళేశ్వరంలో శనివారం సాయంత్రం త్రివేణి సంగమ గోదావరికి హారతినిచ్చారు. దేవాదా య కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి పౌర్ణమి రోజు గోదావరి హారతి కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం నుంచి అర్చకులు బాజా భజంత్రీలతో వెళ్లి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం గోదావరి నదికి హారతినిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు

మొగుళ్లపల్లి, జూన్ 22: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో నాలుగో తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి వేల్పుల ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25న ఉదయం 10 గంటలకు స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో మండల స్థాయి ఎంపికలు జరుగను న్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు 8 నుంచి 9 ఏళ్లలోపు ఉండి నాల్గవతరగతి చదు వుతూ ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పాఠశాల స్టడీ, పుట్టినతేదీ సర్టిఫికెట్, మూడో తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, ఆధార్‌కార్డు, కులం సర్టిఫికెట్, నాలుగు కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటోలు, నాలుగు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 28న భూపాలపల్లిలో నిర్వహించే జిల్లాస్థాయి ఎంపికలో పాల్గొనాల్సి ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాలకు 9848190566 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

మహిళా కానిస్టేబుల్‌కు రక్షణ కల్పించాలి

డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డికి దళిత సంఘాల నేతల వినతి


డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డితో దళితసంఘాల నేతలు

కాటారం, జూన్ 22: కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఉదంతం నేపథ్యంలో బాధిత మహిళా కానిస్టేబుల్‌కు రక్షణ కల్పించాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బొంకూరి మధు, ఉత్తర తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ కోరారు. ఈ మేరకు శనివారం కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందించారు. డిస్మిస్ అయిన ఎస్సై భవానీసేన్ ద్వారా బాధితురాలికి ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ పరంగా తక్షణమే ఆమెకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం జిల్లా సీనియర్ నాయకుడు పొట్ల పోచయ్య, ఆదివాసీ దళిత మహిళ హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సరస్వతి, యూఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు, ఎమ్మార్పీఎస్ నాయకులు చిరంజీవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్

ములుగు కలెక్టరేట్, జూన్ 22: రైతు సంక్షేమ మే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ అనుబంధ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్ల పెల్లి రాజేందర్‌గౌడ్ అన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయడం హర్షణీయమన్నారు. ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా అధ్యక్షతన శనివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయాలని ఆదేశాలు జారీ చేయడం పట్ల ములుగు జిల్లా రైతుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

- వెంకటాపురం(నూగూరు): రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని వెంకటాపురం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం సాంబశివరావు అన్నారు. మండలకేంద్రంలో శనివారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు రాహుల్‌గాంధీ వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లో భాగంగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీకి సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ ఆమోదం తెలుపడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు కళాధర్, బాలసాని వేణు, ఎంపీటీసీలు గార్లపాటి రవి, కొండపర్తి సీతాదేవి, కిరణ్, వాసు, భూషణం, దేవసహాయం పాల్గొన్నారు.

దేవునిగుట్టలో వైద్య శిబిరం

గోవిందరావుపేట, జూన్ 22: మండలం లోని పస్రాకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవునిగుట్ట గొత్తికో యగూడెంలో శనివారం పస్రా పీహెచ్‌సీ ఆధ్వ ర్యంలో వైద్యశిబిరం జరిగింది. 22 మందికి డాక్టర్ రవీందర్ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గొత్తికోయలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని అన్నారు. వేడి ఆహారాన్ని తీసుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. ఎవరైనా జబ్బుబారిన పడితే సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో పస్రా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధు, హెల్త్ అసిస్టెంట్ నర్సింగరావు, ల్యాబ్ టెక్నీషియన్ నర్సింగరావు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, ఏఎన్ఎం సంపూర్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యం మిథ్య!

5వ పేజీ తరువాయి

పూర్తిస్థాయిలో సేవలు అందించలేకపోతున్నాయి. రోగాల బారిన పడిన సందర్భంలో గ్రామీణ ప్రజలు ఆర్ఎంపీలను, పీఎంపీలను ఆశ్రయిస్తున్నారు.

మందుల కొరత

ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, పల్లె దవాఖానాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. రోగులకు పెట్టడానికి గ్లూకోజు బాటిళ్లు కూడా చాలినన్ని ఉండడం లేదు. జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులకు ప్రతీ రోజు 500మంది వరకు ఏరియా ఆస్పత్రులకు 300 వరకు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లుకు 150 వరకు, పీహెచ్‌సీలకు 100 వరకు, ఆరోగ్య ఉప కేంద్రాలకు 50 మంది వరకు రోగులు వస్తుంటారు. యాంటీబయాటిక్, యాంటీ రేబిస్, ఏఆర్‌వీ, ఇన్సులిన్ వంటివి కూడా అందుబాటులో ఉండడం లేదు. మూణ్ణెళ్లకోసారి వచ్చే మందుల కోటా కూడా సరిగా లేవడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం. అంటువ్యాధులు ప్రబలే కాలం. కనీసం ఈ సమయంలోనైనా అవసరమైన మందులను అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటు ఉంచాల్సి ఉండగా.. ఆ పరిస్థితి కనిపించడం లేదు. చాలా ఆస్పత్రుల్లో సరైన మందులు లేక రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది.

25న బెస్ట్ 'అవైలబుల్' ఎంపిక

ఏటూరునాగారం రూరల్/భూపాలపల్లి టౌన్, జూన్ 22: భూపాలపల్లి జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద మూడు, ఐదు, ఎనిమిదో తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న గిరిజన విద్యార్థులకు ఈ నెల 25న ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పోచం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 128 మంది విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు దరఖాస్తులు సమర్పించారని తెలిపారు. ఈ నెల 25న ఉదయం 11.30 గంటలకు ఏటూరునాగాంం ఐటీడీఏ కార్యాలయంలో లక్కీ డ్రా పద్ధతిలో ఎంపిక జరగనుందని, విద్యార్థులు సర్టిఫికెట్లతో తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

గిరిజన గ్రామాలను సందర్శించిన డీఎంహెచ్‌వో


హాజరు రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

తాడ్వాయి, జూన్ 22: మండలంలోని బందాల, బొల్లెపల్లి, పోచాపూర్ గిరిజన గ్రామాల ను డీఎంహెచ్‌వో, మండల స్పెషలాఫీసర్ అల్లెం అప్పయ్య వైద్య బృందంతో కలిసి శనివారం సందర్శిం చారు. ఈసందర్భంగా ఆయన గ్రామస్థులనుద్దేశించి మాట్లాడుతూ రాబోయే మూడునెలలపాటు వర్షాలు బాగా కురిసి వరదలు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగానే నిత్యావసర సరుకులను సమకూర్చుకో వాలన్నారు. పోచాపూర్‌లో గత ఏడాది వచ్చిన వరదలతో బ్రిడ్జి తెగిపోయిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ గిరిజనుల ఆరోగ్య పరిస్థితులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది గిరిజనుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. అనంతరం బొల్లెపల్లిలోని అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతులను పరిశీలించి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రవీందర్, ఎంపీవో శ్రీధర్‌రావు, డాక్టర్ పవన్, పంచాయతీ సెక్రటరీ రమేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

వాజేడు, జూన్ 22: వరదలపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో శ్రీకాంత్ నాయుడు అన్నారు. వరద ముంపునకు గురైయ్యే బొల్లారంలో గ్రామ సమాఖ్య మహిళా సంఘం సభ్యులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. వర్షాకాలం వచ్చిన దృష్ట్యా ప్రజలందరికీ వరదలపై ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తూ ఉండాలని సూచించారు. వరదలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వరద బాధితులను పునరావాస కేంద్రాల్లో కల్పించాలన్సి సౌకర్యాలను వివరించారు. అదే విధంగా విద్యుత్, ఇతర సిబ్బందితో విద్యుత్ సౌకర్యం తదితర అంశాలపై ఆయన చర్చించారు.

వాహనాల తనిఖీలు

గణపురం, జూన్ 22: పరకాల-భూపాలపల్లి జాతీయ ప్రధాన రహదారి చెల్పూరు కేటీపీపీ ఐమాక్స్ వద్ద ఎస్సై సాంబమూర్తి నేతృత్వంలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేశారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఇసుక వాహనాలను ఆపి అనుమతి పత్రాలతో పాటు నంబర్ ప్లేట్లను పరిశీలించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నేతలు


బండి సంజయ్‌ను సత్కరిస్తున్న కన్నం యుగేందర్

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 22: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నం యుగేందర్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హుజురాబాద్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నేతలు రామకృష్ణ, చీర్ల అశోక్, రాజునాయక్, బండారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

- గణపురం : కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను బీజేపీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కరీంనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటాపూరం మండలంలోని రామప్ప దేవాలయం, కోటగుళ్లను సందర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మంద మహేష్, నాయకులు చెలుమల్ల ప్రవీణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ

ఉపాధ్యాయుడి మృతి


మధుకుమార్ (ఫైల్)

ములుగు(రూరల్), జూన్22: భద్రాచలంలో పార్లమెంటు ఎన్నికల విధుల్లో ఉండగా బాత్రంలో జారిపడి కోమాలో వెళ్లిన ఉపాధ్యాయుడు పోరిక మధు కుమార్ (54) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ములుగు మండలం మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక మధుకుమార్ వెంకటాపూర్ మండలంలోని భూర్గుపేటలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మే నెల 12న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో భద్రాచలంలో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో బాత్రూంలో కాలుజారి పడ్డారు. దీంతో తలకు తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లారు. తోటి ఉద్యోగులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా 40 రోజులపాటు చికిత్స పొందిన మధు కుమార్ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య మాధవి, కుమారులు అనిరుధ్, శుశాంత్ ఉన్నారు.

మృతుల కుటుంబాల ఆందోళన

ఏటూరునాగారం రూరల్, జూన్ 22: ఇసుక లారీల వల్ల ప్రమాదాలకు గురై మృతి చెందిన వారి కుటుంబాలు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనలకు దిగారు. మండల కేంద్రంలోని 163వ జాతీయ రహదారిపై శనివారం బైఠాయించారు. ఇటీవల గుర్తు తెలియని ఇసుక లారీ ఢీకొని బోడ శ్రీను, బందెల సాంబయ్య మృతి చెందారు. ఈ ప్రమాదానికి కారణమైన ఇసుక లారీలను గుర్తించడంలో పోలీసులు సహకరించడం లేదని, నెలలు గడస్తున్నా దర్యాప్తును వేగవంతం చేయడం లేదని మృతుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సై తాజొద్దీన్ అక్కడికి చేరుకొని నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

కాటారం, జూన్ 22: విద్యుదాఘాతంతో మండలంలోని శంకరంపల్లి గ్రామంలో పెనుగొండ శ్రీనివాస్ అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు శనివారం మృతి చెందింది. గ్రామస్థులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మేతకు వెళ్లే క్రమంలో ఎద్దు గ్రామంలోని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి షాక్‌కు గురై మృతి చెందింది. చనిపోయిన దుక్కిటెద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతు శ్రీనివాస్ కోరుతున్నాడు.

కోమటిపల్లిలో గేదె...

మంగపేట, జూన్ 22 : విద్యుదాఘాతంతో సూడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని కోమటిపల్లి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శనివారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన రైతు పులి వెంకటయ్య తనకు రెండు గేదెలను సమీప అడవిలోకి మేత కోసం పంపించాడు. సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో గ్రామ పొలిమేరలో ఎలాంటి రక్షణ లేని విద్యుత్ తీగలు ట్రాన్స్‌ఫార్మర్‌కు బయటకు ఉండటంతో గేదె ఒకటి అటువైపు వెళ్లి షాక్‌కు గురై మృతి చెందింది. అక్కడికి వచ్చిన లైన్‌మన్ వచ్చి ఈ విషయాన్ని తమ శాఖ అధికారులకు తెలియజేస్తామని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి వెళ్లిపోయాడని స్థానికులు తెలిపారు. మృతి చెందిన గేదె విలువ రూ.40 వేలు ఉంటుందని, బాధితుడికి నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్థులు కోరారు.

అన్నారం బ్యారేజీలో కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్, జూన్ 22: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీలో రెండో రోజు సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిపుణుల బృందం పరీక్షలు శనివారం కొనసాగాయి. జియో ఫిజికల్ శాస్త్రవేత్త ధనుంజయ్ నాయుడు నేతృత్వంలోని ఆరుగురు నిపుణుల బృందం బ్యారేజీలో జియో రాడార్, జియోఫిజికల్ టెస్టులను చేసింది. బ్యారేజీ కిందున్న మట్టిపరిస్థితిపై అధ్యయనం చేసేందుకు పరీక్షలు చేపట్టనుండగా ఇందుకు కావాల్సిన నమూనాల సేకరణ కోసం దెబ్బతిన్న వెంట్లలో డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. 25 మీటర్ల మేర హోల్స్ వేసి కిందున్న మట్టి నమూనాలను సేకరించనున్నారు.